ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
గురువారం 2 జనవరి 2025



కొత్త సంవత్సర సందడి

దేవాలయాలు, చర్చిల్లో రద్దీ



ప్రత్యేక అలంకరణలో పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి



శాంథోమ్ చర్చిలో జరిగిన ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు

ప్యారీస్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా అంతటా నూతన సంవత్సరాది సందడి నెలకొంది. కొత్త ఆశలతో నుతన సంవత్సరానికి ఉత్సాహంగా స్వాగతం చెప్పారు. ఈ సారి వేడుకల్లో గాయకులు, లైవ్‌బాండ్‌ల సందడి అధికంగా కనిపించింది. మంగళవారం అర్థ రాత్రి పాత సంవత్సరానికి వీడ్కోలు చెప్తూ, 2025 సంవత్సరానికి రాష్ట్ర ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. యువకులు అర్ధరాత్రి బాణసంచా కాల్చి సందడి చేశారు. కొంత మంది భక్తి భావంతో తెల్లవార్లు ఆలయాల్లో గడిపారు. కొత్త సంవత్సరంలో దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందాలని, ప్రపంచ దేశాల్లో శాంతి నెలకొనాలని ముస్లింలు మసీదుల్లో ప్రార్థనలు నిర్వహించగా, క్రైస్తవులు చర్చిల్లో క్యాండిల్స్ వెలిగించి యేసుక్రీస్తు ప్రార్థనలు చేశారు. ప్రయాణీకుల సౌకర్యార్థం చెన్నై మెట్రో రైల్వే సంస్థ అర్ధరాత్రి ఒంటిగంట వరకు ప్రత్యేక రైళ్లు, మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ ప్రత్యేక బస్సులు నడిపాయి. బేకరీలు, స్వీట్ షాపులు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. కొత్త ఏడాదిలో ప్రాణనష్టం జరగకుండా రాష్ట్ర పోలీసు శాఖ బందోబస్తును పకడ్బందీగా నిర్వహించి ప్రజలచే శభాష్ అనుపించుకుంది. ప్రధాన నగరాల్లో డ్రంకెన్ డ్రైవ్ కట్టడిచేసేలా ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిఘా పెట్టారు. కాగా, కొత్త సంవత్సరం వేడుకల్లో మద్యం ఏరులైపారింది. పబ్‌లు, క్లబ్‌ల్లోని సండడి అధికంగా కనిపించింది.



అభివాదం చేస్తున్న రజనీకాంత్

మంచివారిని దేవుడు పరీక్షిస్తాడు

● రజనీకాంత్ శుభాకాంక్షలు

(అడయార్, ఆంధ్రజ్యోతి)

సూపర్‌స్టార్ రజనీకాంత్ రాష్ట్ర ప్రజలకు, అభిమానులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జనవరి ఒకటో తేదీ బుధవారం ఉదయం నుంచే పోయెస్ గార్డెన్‌లోని తన నివాసం ముందు వేచివున్న అభిమానులకు ఆయన శుభాకాంక్షలు చెప్పారు. అలాగే, తన ఎక్స్ ఖాతాలో ఓ ట్వీట్ చేస్తూ, 'మంచి వారిని దేవుడు పరీక్షిస్తాడు. చెడ్డవారికి దేవుడు అపరిమితంగా ఇస్తారు. కానీ, చేయి వదిలేస్తాడు. నూతన సంవత్సర శుభాకాంక్షలు, వెల్‌కమ్2025' అంటూ పేర్కొన్నారు. కాగా, రజనీకాంత్ ప్రస్తుతం యంగ్ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో 'కూలీ' సినిమాలో నటిస్తున్న విషయం తెల్సిందే. మరోవైపు అగ్రహీరో అజిత్ కుమార్ తన భార్యాపిల్లలతో కలిసి సింగపూర్‌లో నూతన సంవత్సర వేడుకలను జరుపుకున్నారు. స్టార్ హీరోయిన్ నయనతార, ఆమె భర్త, దర్శకుడు విఘ్నేష్ శివన్, దర్శక హీరో ఆర్.మాదవన్ దుబాయ్‌లో కొత్త సంవత్సర వేడుకల్లో పాల్గొని ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు.



సీఎంకు శుభాకాంక్షలు చెబుతున్న టీఆర్ బాలు, కనిమొళి తదితరులు

సీఎంకు శుభాకాంక్షల వెల్లువ

● క్యాంపు ఆఫీస్‌కు క్యూకట్టిన నేతలు

అడయార్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు మంత్రులు, పార్టీ నేతలు, ప్రభుత్వ, పోలీస్ ఉన్నతాధికారులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు పోటీ పడ్డారు. ఆళ్వార్‌పేటలోని సీఎం క్యాంపు కార్యాలయానికి వారంతా క్యూ కట్టారు. సీఎంను కలిసి శుభాకాంక్షలు చెప్పిన వారిలో డీఎంకే ప్రధాన కార్యదర్శి, మంత్రి దురైమురుగన్, కోశాధికారి టీఆర్ బాలు, ముఖ్య కార్యదర్శి కేఎన్ నెహ్రూ, ఆర్గనైజింగ్ కార్యదర్శులు ఆర్ఎస్ భారతి, జగద్రక్షకన్, ఉప ప్రధాన కార్యదర్శి కనిమొళి, ఎ.రాజా ఉన్నారు. అలాగే, టీకేఎస్ ఇళంగోవన్, పూచ్చి మురుగన్, హార్బర్ ఖాజా, మంత్రులు, ఏవీ వేలు, తంగం తెన్నరసు, ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం, టీఎం అన్బరసన్, సుబ్రమణియన్, పీకే శేఖర్‌బాబు, అన్బిల్ మహేశ్, టీఆర్‌బీ రాజా, నగర మేయర్ ఆర్.ప్రియ, ఎంపీలు కళానిధి వీరాస్వామి, కదిర్ ఆనంద్, మలైయరసన్, అరుణ్ నెహ్రూ, అనేక మంది ఎమ్మెల్యేలున్నారు. అదేవిధంగా సీఎంను కలిసిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల్లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం, డాక్టర్ జె.రాధాకృష్ణన్‌లతో పాటు పలువురు అధికారులు కూడా ఉన్నారు. అదే విధంగా అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి కె.పళనిస్వామికి ఆ పార్టీ సీనియర్ నేతలు, మాజీ మంత్రులు, కీలక నేతలు విషెస్ చెప్పారు. దీంతో గ్రీన్‌వేస్ రోడ్డులోని మాజీ సీఎం నివాసం అన్నాడీఎంకే కార్యకర్తలు, నేతలతో సందడిగా కనిపించింది.

సీఎం విమానం ఆలస్యం

● విడిదిగృహంలో వేచివున్న స్టాలిన్

వాషర్‌మెన్‌పేట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కన్నికుమారిలో రెండు రోజుల పర్యటన ముగించుకొని ముఖ్యమంత్రి స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు మంగళవారం విమానంలో చెన్నై వెళ్లేందుకు తూత్తుకుడి చేరుకున్నారు. వారి విమానం ఉదయం 11.15 గంటలకు బయల్దేరాల్సి ఉండగా, గంట ఆలస్యంగా మధ్యాహ్నం 12.15 గంటలకు బయల్దేరింది. విమానం బయల్దేరడంలో జాప్యంపై విమానాశ్రయ అధికారులు మాట్లాడుతూ... చెన్నై విమానాశ్రయంలోని రన్‌వేకు ప్రతివారం మంగళ, శనివారాల్లో మరమ్మతులు చేపడుతుంటారని, మంగళవారం కూడా పనులు చేపట్టడంతో తూత్తుకుడి నుంచి విమానం బయల్దేరడంలో జాప్యం జరిగిందని తెలిపారు. కాగా, విమానం బయల్దేరేందుకు ఆలస్యం కావడంతో, ఓ ప్రైవేటు విడిది గృహంలో గంట సేపు వేచివున్న ముఖ్యమంతి, అక్కడే మధ్యాహ్నం భోజనం చేసి, విశ్రాంతి తీసుకొని, అనంతరం విమానాశ్రయానికి బయల్దేరి వెళ్లారు.

రాష్ట్రంలో మరో 13 మున్సిపాలిటీలు



కన్నియాకుమారి

● కన్నియాకుమారి, అరూర్‌లకు మున్సిపాలిటీ హోదా

● జీవో విడుదల చేసిన ప్రభుత్వం

చెన్నై, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో 13 మున్సిపాలిటీలు ఏర్పాటు కానున్నాయి. ఇన్నాళ్లా యూనియన్ పంచాయతీలుగా వున్న పలు పట్టణాలకు మున్సిపాలిటీ హోదా కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం 5 ప్రత్యేక జీవోలు విడుదల చేసింది. ఆ మేరకు కన్నియాకుమారి, అరూర్, పెరుందురై సహా 13 కొత్త మున్సిపాలిటీలు ఏర్పాటుకానున్నాయి. పట్టణీకరణ విషయంలో రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో ఉంది. 2011 జనాభా లెక్కల ప్రకారం, పట్టణ జనాభా 48.45 శాతం కాగా, ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లో ఆ సంఖ్య మరింత పెరిగింది. రాష్ట్రంలో పట్టణీకరణ అత్యంత వేగంగా జరుగుతున్న దృష్ట్యా, పట్టణ, స్థానిక సంస్థలను పునర్వ్యవస్థీకరించాల్సిన ఆవశ్యకతను ప్రభుత్వం గుర్తించింది. కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, పట్టణ పంచాయతీల చుట్టూ ఉన్న యూనియన్ పంచాయతీలు, గ్రామ పంచాయితీలు నగరాలు, మహా నగరాలకు ముఖద్వారాలుగా వున్న విషయం తెలిసిందే. ఆయా ప్రాంతాల్లో వున్న బహుళజాతి సంస్థల్లో పని చేస్తున్న వేలాదిమంది ఉద్యోగులకు మౌలిక వసతుల కల్పనతో పాటు అక్కడ ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి చేపట్టాల్సివుంది. పట్టణ ప్రాంతాలకు సమానంగా పరిసర ప్రాంతాలు అభివృద్ధి చేయాల్సి ఉంది. ఆలాంటి చర్యలు చేపట్టాలంటే ఆయా స్థానిక సంస్థల్లో ఉన్న నిధులు సరిపోవు. అందువల్ల ఆయా స్థానిక సంస్థలను కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో విలీనం చేయాల్సి అవసరం ఉంది. దీనివల్ల మున్సిపాలిటీల్లో విలీనమైన ప్రాంతాలు అభివృద్ధి చెందడంతో పాటు ప్రజల జీవన నాణ్యత మెరుగవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ అభివృద్ధి ఆర్థిక కార్యకలాపాలు, కొత్త పరిశ్రమలు ఏర్పాటు, ఉపాధి కల్పన, ఆదాయ వృద్ధి వంటి సర్వతోముఖాభివృద్ధికి దారి తీస్తుంది. ఆ ప్రకారం, 2021వ సంవత్సరంలో 6 కొత్త కార్పొరేషన్లు, 28 మున్సిపాలిటీలు ఏర్పడ్డాయి. అలాగే, 2024 ఆగస్టు 10న తిరువణ్ణామలై, నామక్కల్, కారైక్కుడి, పుదుకోట కార్పొరేషన్లలో సమీపంలో ఉన్న 2 మున్సిపాలిటీలు, 46 గ్రామ పంచాయతీలు విలీనం చేశారు. అలాగే గత ఆగస్టు 12న మహాబలిపురం, శ్రీపెరుంబుదూర్, తిరువయ్యారు తదితర పంచాయతీ యూనియన్లు మున్సిపాలిటీగా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో పట్టణీకరణ స్థాయి, పరిపాలనా అవసరాలు, ప్రజలకు సమర్థవంతమైన, సమగ్రమైన పద్ధతిలో మౌళిక సదుపాయాలు అందించడం, భవిష్యత్తు అవసరాలు పరిగణలోకి తీసుకొని స్థానిక సంస్థలను పునర్వ్యస్థీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

స్థానిక సంస్థల పదవీకాలం...

ప్రస్తుతం 28 జిల్లాల్లోని స్థానిక సంస్థల పదవీకాలం 2025 జనవరితో ముగియనుంది. ఈ జిల్లాల్లోని పట్టణీకరణ పంచాయతీలను సమీపంలోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో విలీనం చేయాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించి ఆయా జిల్లాల కలెక్టర్లతో ఉన్నతస్థాయి కమిటీ సమావేశమై కార్యాచరణ సూచనలు తయారుచేసింది. ఈ సూచనలతో నివేదిక పరిశీలించి, చెన్నై, మదురై, తిరుచ్చి సహా 16 కార్పొరేషన్లతో 4 మున్సిపాలిటీలు, 5 పట్టణ పంచాయతీలు, 149 గ్రామ పంచాయతీల విలీనం, తిరువారూరు, తిరువళ్లూర్, చిదంబరం తదితర 41 మున్సిపాలిటీలతో 147 పంచాయితీలు, 1 పట్టణ పంచాయతి విలీనం కానున్నాయి. అదే విధంగా కన్నియాకుమారి, అరూర్, పెరుందురై సహా కొత్తగా 13 మున్సిపాలిటీలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

అవయవదానంపై పెరుగుతున్న అవగాహన

● గత ఏడాది 266 మంది అవయవదానం

● 1,484 అవయవమార్పిడి శస్త్రచికిత్సలు



చెన్నై, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ యంత్రాంగం చేపడుతున్న ప్రచారం, నిండుప్రాణాన్ని కాపాడాల్సిన ఆవశ్యకత తదితరాల నేపథ్యంలో అవయవదానంపై ప్రజల్లో అవగాహన పెరుగుతోంది. రాష్ట్రంలో గత ఏడాది 266 మంది అవయవదానం చేయడమే ఇందుకు నిదర్శనం. అలాగే, 1,484 అవయవమార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు ఆరోగ్యశాఖ తెలిపింది. రోడ్డు నిబంధనలు అతిక్రమించిన వాహనాలతో ప్రతి రోజూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రమాదాల్లో అనేక మంది మృత్యువాతపడుతున్నారు. అదే సమయంలో రోడ్డు, అగ్ని ప్రమాదాల్లో చికిత్స పొందుతున్న వారికి అవయవాల మార్పిడి చేసి పునర్జన్మ ఇవ్వాల్సివస్తోంది. కానీ, అవయవదానం చేసే వారి సంఖ్య తక్కువగా ఉంటోంది. ఈ నేపథ్యంలో, రాష్ట్రంలో 2008లో కలైంజర్ అవయవదానం ప్రాజెక్ట్ ప్రారంభించారు. 2015లో ఆ ప్రాజెక్ట్ తమిళనాడు శరీర అవయవాల మార్పిడి శస్త్రచికిత్స కమిషనరేట్‌గా పేరు మారింది. ఆ ప్రకారం, మృతుల కుటుంబీకుల అంగీకారంతో అవయవాలను ప్రత్యేక శస్త్రచికిత్స ద్వారా వెలికితీసి అవసరమైన ఆసుపత్రులకు పంపిస్తున్నారు. ఈ నేపథ్యంలో 2023లో అవయవదానం చేసే వారికి ప్రభుత్వ లాంఛనాలతో నివాళులర్పిస్తామని ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. ఆ ప్రకారం, అవయవదానం చేసే వారి భౌతికదేహాలకు ప్రభుత్వం అధికారికంగా అంత్యక్రియలు నిర్వహిస్తోంది. ఈ విషయమై ఆరోగ్యశాఖ అధికారులు మాట్లాడుతూ... అవయవదానం చేసే వారి భౌతికదేహాలకు ప్రభుత్వ లాంఛనాలతో అంజలి ఘటిస్తామనే ప్రకటన నేపథ్యంలో, అవయవదానం చేసేవారి సంఖ్య క్రమంగా పెరుగుతోందన్నారు. గత ఏడాది 266 మంది అవయవదానం చేయగా, 1,484 అవయవ మార్పిడి శస్త్రచికిత్స నిర్వహించామని తెలిపారు. 2008లో ప్రారంభమైన ఈ ప్రాజెక్ట్‌లో ఇప్పటివరకు 2,053 మంది అవయవదానం చేయగా, 12,104 అవయవమార్పిడి శస్త్రచికిత్సలు చేసినట్లు తెలిపారు. అలాగే, 14,300 మంది అవయవాలు దానం చేసేందుకు పేర్లు నమోదుచేసుకున్నారన్నారు. 2021లో 14 ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రుల్లో మాత్రమే అవయవమార్పిడి శస్త్రచికిత్సలకు అనుమతులివ్వగా, ప్రస్తుతం అన్ని ప్రభుత్వ వైద్యకళాశాల ఆసుపత్రులకు విస్తరించినట్లు అధికారులు తెలిపారు.

అన్నాడీఎంకే సమన్వయకర్తను నేనే

కేసు విచారణలో ఉన్నందున పార్టీ నాకే అప్పగించండి ● ఈసీకి తెలిపిన ఓపీఎస్



ఒ.పన్నీర్‌సెల్వం

పెరంబూర్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే 2021లో చేసిన తీర్మానం ప్రకారం, సమన్వయకర్తగా తానే కొనసాగుతున్నానని, అందువల్ల పార్టీని తనకే అప్పగించాలని, రెండాకుల చిహ్నం ఎడప్పాడి పళనిస్వామి వినియోగించడంపై నిషేధం విధించాలని మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం కేంద్ర ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన ఈసీ ముందు తాజాగా అఫిడవిట్ దాఖలు చేశారు. మాజీ ముఖ్యమంత్రి జయలలిత మరణానంతరం పార్టీలో తలెత్తిన విభేదాల కారణంగా ఒ.పన్నీర్‌సెల్వం బృందం పార్టీకి దూరం కాగా, అనంతరం జరిగిన పరిణామాల్లో ఆయన పార్టీలో విలనమైన విషయం తెలిసిందే. ఆ సమయంలో పన్నీర్‌సెల్వం సమన్వయకర్తగా, పళనిస్వామి ఉప సమన్వయకర్తగా ఎంపికయ్యారు. అలాగే, ముఖ్యమంత్రిగా ఎడప్పాడి కొనసాగేలా పార్టీ నిర్ణయం తీసుకుంది. అనంతరం జరిగిన ఎన్నికల్లో పార్టీ పరాజయం కావడంతో, మళ్లీ పార్టీలో లుకలుకలు చోటుచేసుకున్నాయి. ఒ.పన్నీర్‌సెల్వం, ఆయన మద్దతుదారులను పార్టీ నుంచి తొలగించి, పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎడప్పాడి పళనిస్వామిని ఎంపిక చేశారు. ప్రస్తుతం పార్టీ, చిహ్నం ఆయన ఆధీనంలోనే ఉన్నాయి. దీనిని సవాల్ చేస్తూ పన్నీర్‌సెల్వం న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో, ఎన్నికల సంఘం అన్నాడీఎంకేకు రెండాకుల చిహ్నం కేటాయించడంపై నిషేధం విధించాలని కోరుతూ దిండుగల్‌కు చెందిన సూర్యమూర్తి మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ విచారించిన న్యాయస్థానం, ఎన్నికల సంఘం 4 వారాల్లో నిర్ణయం తీసుకోవాలని ఉత్తర్వులు జారీచేసింది. అనంతరం గత నెల 23, 24 తేదీల్లో పళనిస్వామి, పుహళేంది, న్యాయవాది రామ్‌కుమార్ ఆదిత్యన్, సూర్యమూర్తి తదితరుల తరఫున ఎన్నికల సంఘంలో వినతిపత్రాలు సమర్పించారు.

ఓపీఎస్ బదులు పిటిషన్...

రెండాకుల చిహ్నం కేటాయింపుపై ఒ.పన్నీర్‌సెల్వం ఎన్నికల సంఘానికి సమర్పించిన వినతిపత్రంలో... 2021 తీర్మానం ప్రకారం, ప్రస్తుతం పార్టీ సమన్వయకర్తగా తాను వ్యవహరిస్తున్నానని తెలిపారు. ప్రస్తుతం అందుకు సంబంధించిన కేసు న్యాయస్థానంలో విచారణలో ఉన్నందున, పళనిస్వామికి పార్టీ, చిహ్నాన్ని అప్పగించిన ఎన్నికల సంఘం, తన నిర్ణయం వెనక్కి తీసుకోవాలని ఓపీఎస్ పేర్కొన్నారు.

ఇల్లు మారే ఆలోచనలో ఓపీఎస్!

స్థానిక గ్రీమ్స్ రోడ్డులోని ఓ అపార్ట్‌మెంట్‌లో ప్లాట్ అద్దెకు తీసుకుని వున్న ఓపీఎస్.. జ్యోతిష్యుల సూచన మేరకు ఇల్లు మారే యోచనలో వున్నట్లు తెలుస్తోంది. రోజురోజుకు ఆయన రాజకీయంగా బలహీనపడుతుండడం, ఆయన ప్రత్యర్థి ఈపీఎస్‌కు పార్టీ, చిహ్నం కేటాయించడం తదితరాలు ఓపీఎస్‌ను ఆలోచనలో పడేశాయి. గత పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ మద్దతుతో ఇండిపెండెంట్‌గా పోటీచేసి విజయం సాధించి, మళ్లీ పార్టీ తన చేతుల్లోకి తీసుకోవాలని ఓపీఎస్ భావించినా, ఆయన ఘోరపరాజయంతో దానికి ఫుల్‌స్టాప్ పడింది. ఈ నేపథ్యంలో, ప్రస్తుత ఉంటున్న ఇల్లు మారిస్తే మంచిదని ఓ జ్యోతిష్యుడు ఓపీఎస్‌కు సలహా ఇచ్చినట్లు సమాచారం. దీంతో, మరో ఇంటికి మారడంపై ఓపీఎస్ తన సహచరులతో చర్చించినట్లు తెలిసింది.

విజయ్ పార్టీతో డీఎంకే కూటమికి నష్టం లేదు : వైగో

అడయార్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): హీరో విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే)తో డీఎంకే కూటమికి ఎలాంటి నష్టం లేదని ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో అభిప్రాయపడ్డారు. ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ, డీఎంకే కూటమిలో ఎలాంటి విభేదాలు లేవని, మేమంతా ఐకమత్యంతోనే ఉన్నామన్నారు. విజయ్ రాజకీయాల్లోకి రావడం వల్ల డీఎంకే కూటమికి ఎలాంటి నష్టం లేదన్నారు. తాను ఉన్నంతవరకు డీఎంకే ప్రభుత్వం పడిపోవడాన్ని అంగీకరించమన్నారు. డీఎంకే కూటమికి హాని చేసే పార్టీ లేదా కూటమిలో చేరబోనని స్పష్టం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అన్నామలై వ్యాఖ్యలు, కొరడాతో కొట్టుకోవడం వంటి చర్యలు చూసి ఆనందించేందుకు చాలా బాగున్నాయన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసేలా ముఖ్యమంత్రి స్టాలిన్ కొత్త కొత్త సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్రం దశలవారీగా అణిచివేసేందుకు ప్రయత్నిస్తుందన్నారు. ఇలాంటి చర్యలు భారత ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించగలవా అనే సందేహం కలుగుతుందని వైగో పేర్కొన్నారు.

రూ.525 కోట్లతో కలైంజర్ కల్చరల్ సెంటర్

అడయార్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఈసీఆర్ రోడ్డులో రూ.525 కోట్లతో హైటెక్ హంగులతో కలైంజర్ కల్చరల్ సెంటర్‌ను ప్రభుత్వం నిర్మించనుంది. ఇందుకోసం కోస్టల్ జోన్ రెగ్యులేటర్ అథారిటీ అనుమతి కోరింది. ఈ ఇంటర్నేషనల్ కల్చరల్ సెంటరులో 5 వేల సీటింగ్ కెపాసిటీలో రూ.102 కోట్ల వ్యయంతో అతిపెద్ద ఆడిటోరియం నిర్మించనున్నారు. అలాగే, ఏక కాలంలో 10 వేల మంది వీక్షించే ఎగ్జిబిషన్ హాల్, మినీ ఆడిటోరియంలను నిర్మించనున్నారు.

సమాచార దృష్టి

నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

పెరంబూర్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు విద్యా సంస్థలు గురువారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. ఈ విద్యాసంస్థల్లో అర్ధ వార్షిక పరీక్షలు డిసెంబరు 23వ తేదీతో ముగిసి, 24 నుంచి సెలవులు ప్రకటించారు. ఈ క్రమంలో, గురువారం నుంచి అన్ని పాఠశాలలు ప్రారంభమవుతాయని పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది.

ప్రోత్సాహక వేతనానికి దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆదిద్రావిడులు, గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో, పీహెచ్‌డీ చదివే విద్యార్థులు ప్రోత్సాహక వేతనం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఆదిద్రావిడులు, గిరిజనులు, మతం మారిన క్రైస్తవ ఆదిద్రావిడుల వర్గాలకు చెందిన పూర్తికాల పీహెచ్‌డీ చేస్తున్న విద్యార్థులు దీనికి అర్హులు. ఆసక్తి కలిగిన విద్యార్థులు www.dge.tn. gov. in/forms/deptname/1 అనే వెబ్‌సైట్‌లో ఈ నెల 31వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.

9 నుంచి మార్కెటింగ్ అవకాశాలపై శిక్షణ

పెరంబూర్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఔత్సామిక పారిశ్రామికవేత్తల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మార్కెటింగ్ అవకాశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. గిండి లోని ఆ సంస్థ కార్యాలయంలో ఈ నెల 9 నుంచి 11వ తేది వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5.45 గంటల వరకు శిక్షణ ఉంటుంది. అంతర్జాతీయ మార్కెటింగ్ విధానం, ఎగుమతులు, దిగుమతులు, జీఎస్‌టీ తదితర విషయాలను మార్కెటింగ్ రంగ నిపుణులు వివరించనున్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు www.ed-tn.in అనే వెబ్‌సైట్‌లో తమ పేరు నమోదుచేసుకోవచ్చు. వివరాలకు 9080130299, 90806 09808 నెంబర్లకు సంప్రదించవచ్చు.

వృత్తిశిక్షణ కేంద్రాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కొత్తగా వృత్తి శిక్షణ కేంద్రాల ఏర్పాటుచేయగోరు వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు ఉపాధి, శిక్షణ శాఖ విడుదల చేసిన ప్రకటనలో.. ఆసక్తి కలిగిన విద్యాసంస్థలు, వ్యక్తులు www.skilltraining.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో గురువారం నుంచి ఫిబ్రవరి 28వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు రుసుము రూ.5,000, తనిఖీ రుసుముగా రూ.8,000 చెల్లించాల్సి ఉంది. దరఖాస్తులు, స్వయంగా ఆయా సంస్థలు, ప్రాంతా లు తనిఖీ చేసి, వచ్చే విద్యా సంవత్సరం నుంచి కోర్సులు ప్రారంభించేందుకు అనుమతులు ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు.

పేరు సవరణకు నేడు తుదిగడువు

ఐసిఎఫ్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులు, తమ పేర్ల జాబితాల సవరణలుంటే గురువారం తుది గడువు అని పరీక్ష శాఖ తెలిపింది. పేర్లలో సవరణలుంటే అందుకు సంబంధించిన వివరాలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి వెంటనే సమర్పించాలని అధికారులు తెలిపారు.

పొంగల్ సందర్భంగా ప్రత్యేక కొండ రైళ్లు

పెరంబూర్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పొంగల్ సందర్భంగా నీలగిరి జిల్లా ఊటీకి ప్రత్యేక కొండ రైలు సేవలు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం, ఈ నెల 16,18 తేదీల్లో మేట్టుపాళయం నుంచి ఊటీకి ఉదయం 9.10 గంటలు, ఊటీ నుంచి మేట్టుపాళయానికి 17,19 తేదీల్లో ఉదయం 11.25 గంటలకు, కున్నూరు నుంచి ఊటీకి ఈ నెల 16 నుంచి 19వ తేది వరకు ఉదయం 8.20 గంటలు, ఊటీ నుంచి కున్నూరుకు సాయంత్రం 4.45 గంటలకు ప్రత్యేక రైళ్లు నడుపనున్నారు. అలాగే, రౌండ్ ట్రిప్ జాయ్ రైలు ఊటీ-గెత్తి మధ్య ఉదయం 9.45, 11.35, మధ్యాహ్నం 3 గంటలకు నడుపనున్నట్లు అధికారులు తెలిపారు.

రేపు పనిచేయనున్న రేషన్ దుకాణాలు

పెరంబూర్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాలు ఈ నెల 3, 10 తేదీల్లో పనిచేయనున్నాయి. రేషన్ దుకాణాలకు ప్రతినెలా మొదటి, రెండవ శుక్రవారాలు సెలవు రోజులు కాగా, అందుకు బదులుగా తర్వాత వచ్చే ఆదివారాలు పనిదినాలు. ఈ క్రమంలో, బియ్యం రేషన్ కార్డుదారులకు పొంగల్ గిఫ్ట్ ప్యాక్ అందించనున్న నేపథ్యంలో, ఈ నెల 3,10 తేదీల్లో రేషన్ దుకాణాలు పనిచేస్తాయని, అందుకు బదులుగా ఈ నెల 15, ఫిబ్రవరి 22 తేదీలు సెలవు రోజులుగా ఉంటాయని సహకార శాఖ తెలియజేసింది.

నేడు విద్యుత్ గ్రీవెన్స్

వాషర్‌మెన్‌పేట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) స్థానిక అడయార్ పరిధిలో గురువారం విద్యుత్ గ్రీవెన్స్ జరుగనుంది. వేళచ్చేరి మెయిన్ రోడ్డులోని వేళచ్చేరి ఉప విద్యుత్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు జరిగే శిబిరంలో అడయార్ పరిధిలోని విద్యుత్ సమస్యలకు పరిష్కారం పొందవచ్చు.

రేపు ఆవడి, పెరంబూర్‌లో...

ఆవడి, పెరంబూర్ పరిధిలో శుక్రవారం విద్యుత్ గ్రీవెన్స్ జరుగనుంది. పెరంబూర్ పరిధిలో సింప్సన్ ఎదురుగా ఉన్న సెంబియం ఉప విద్యుత్ కేంద్రం, ఆవడి పరిధిలో ఆవడి ఉప విద్యుత్ కేంద్రం ప్రాంగణంలోని నిర్వహణ ఇంజనీర్ కార్యాలయంలో గ్రీవెన్స్ జరుగుతుందని విద్యుత్ బోర్డు ఓ ప్రకటనలో తెలిపింది.

తెలుగు చర్చిలు, సంఘాల్లో ఆంగ్ల సంవత్సరాది సంబరాలు

ప్యారీస్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆంగ్ల సంవత్సరానికి స్వాగతం పలుకుతూ రాజధాని నగరంలోని తెలుగు చర్చిలు వెలుగులు విరజిమ్మాయి. విశ్వశాంతి కాంక్షిస్తూ నిర్వహించిన ప్రార్థనలకు క్రైస్తవులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. విజయాలతో 2025లో అడుగు పెట్టాలని, సమాజానికి ప్రభావితం చేసే అంశాలతో క్రైస్తవులు ముందుకు వెళ్లాలని పాస్టర్లు బోధించారు. అలాగే పలు తెలుగు సంఘాల్లో కూడా ఘనంగా వేడుకలు నిర్వహించారు.

మోడల్ లైన్‌లో...

వాషర్‌మెన్‌పేట సమీపంలోని మోడల్‌లైన్ సెయింట్ పీటర్స్ లూథరన్ హోలీ చర్చిలో అసిస్టెంట్ పాస్టర్ ఆదాంరాజ్, సీహెచ్ శాస్త్రిబాబు దైవ సందేశం వినిపించారు. సండే స్కూల్, యూత్ స్త్రీ సమాజం సభ్యులు ఆలపించిన ప్రత్యేక గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



మోడల్‌లైన్ చర్చి వేడుకల్లో ఆదాంరాజ్, శాస్త్రిబాబు తదితరులు

విల్లివాక్కంలో...

విల్లివాక్కం భారతినగర్‌లోని గాడ్స్ లవ్ ది నీడి సోషియల్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వంద మంది దివ్యాంగులకు ట్రస్ట్ అధ్యక్షుడు వీడీ శామ్యూల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సహాయాలు పంపిణీ చేశారు. ఆత్మీయ అతిథులుగా పోలీస్ ఇన్‌స్పెక్టర్ తిరుణావుక్కరుసు, టామ్స్ వ్యవస్థాపకులు గొల్లపల్లి ఇశ్రాయేలు, అధ్యక్షులు నేలటూరి విజయకుమార్ ఉపాధ్యక్షుడు ఊటుకూరి దేవదానం తదితరులు పాల్గొన్నారు.



విల్లివాక్కం భారతినగర్‌లో అంధులకు సహాయాలు అందజేస్తున్న గొల్లపల్లి ఇశ్రాయేలు, నేలటూరి విజయ్‌కుమార్ తదితరులు

గణేశ్‌పురంలో...

వాసర్పాడి సమీపంలోని గణేశ్‌పురం ఎంకేఎం నగర్‌లోవున్న ఈసీఐ సెయింట్ పీటర్స్ తెలుగు చర్చిలో రెవ. డి.బాలరాజ్ అధ్యక్షతన జరిగిన ఆంగ్ల సంవత్సరాది ప్రత్యేక ప్రార్థనలో 2025వ సంవత్సరం వాగ్దానం కార్డు, క్యాలెండర్లను ఆవిష్కరించారు.. యువతీ, యువకులు, సండేస్కూల్, స్త్రీల సమాజం సభ్యులు ఆలపించిన ప్రత్యేక గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



గణేశ్‌పురంలో క్యాలెండర్, వాగ్దానం కార్డు ఆవిష్కరిస్తున్న రెవ. డి.బాలరాజు

పెరంబూర్‌లో...

పెరంబూర్‌లోని తమిళనాడు తెలుగు సాంస్కృతిక సంఘ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి సంఘ అధ్యక్షుడు తమ్మినేని బాబు సారథ్యం వహించారు. ముఖ్యఅతిథిగా జనని ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య హాజరై 2025వ సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరించి సభ్యులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వీఆర్ కేశవులు, ఎన్‌వీవీ సారథి, వసుంధర దేవి పాల్గొని 48 ఏళ్లుగా సంస్థ అందిస్తున్న సేవలను కొనియాడారు.



తమిళనాడు తెలుగు సాంస్కృతిక సంఘం క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న గుడిమెట్ల చెన్నయ్య

అయినావరంలో...

అయినావరం రైల్వే క్వార్టర్స్ ప్రాంగణంలోని రక్షణ సైన్యం చర్చిలో వేడుకలు ఘనంగా జరిగాయి. సండే స్కూల్ చిన్నారులు పాటలు, నృత్యాలతో సందడి చేశారు. క్రాప్స్ కమాండింగ్ ఆఫీసర్లు లెఫ్టినెంట్ ఎం.విక్టర్ ఇమ్మానియేలు, లెఫ్టినెంట్ ఎంపీఆర్ నివేదిత, కార్యదర్శి సూరిపోగు థామస్, నిర్వాహకులు సాల్మన్, గొల్లపల్లి ప్రభుదాస్, పీ.పురుషోత్తం, సుమన్, సంజయ్, బేబి, ఆరోగ్య మేరీ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



అయినావరం రక్షణ సైన్య సంఘంలో చిన్నారులు సందడి

విల్లివాక్కం ఎంటీహెచ్ రోడ్డులో...

విల్లివాక్కం ఎంటీహెచ్ రోడ్డులోని పునరుత్థాన లూథరన్ చర్చిలో ఉజ్జీవమణి రవిబాబు ప్రారంభ ప్రార్థనతో ప్రారంభమైన కొత్త సంవత్సరాది వేడుకల్లో పాస్టర్ రెవ.ఇంటి రవిబాబు దైవ సందేశం వినిపించారు. సంఘ క్వయర్ బృందం నూతన గీతాలు ఆలపించారు. పాల్ చంద్రశేఖర్, డి.శాంతి విక్టర్, డా.ఎ.శామ్‌బాబు, బైబిల్ పఠనం చేశారు. చైర్మెన్ ఎన్.ప్రభుకృపాదాస్, సంఘ పెద్దలు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



విల్లివాక్కం ఎంటీహెచ్ రోడ్డులో పునరుత్థాన లూథరన్ చర్చిలో ప్రసంగిస్తున్న రెవ. ఇంటి రవిబాబు

టీపీసత్రంలో...

టీపీసత్రం తెలుగు లైన్‌లోని కల్వరి తెలుగు బాప్టిస్ట్ చర్చిలో జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో సండేస్కూల్ చిన్నారులు ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. ఆసియా బాప్టిస్ట్ పాస్టర్స్ ఫెలోషిప్ వ్యవస్థాపకులు రెవ. డా.ఎస్ ప్రకాశ్‌రాజ్ నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరించారు.



టీపీసత్రం కల్వరి తెలుగు బాప్టిస్ట్ చర్చిలో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న రెవ. ఎస్.ప్రకాశ్‌రాజ్

పెరంబూర్ కుక్స్ రోడ్డులో...

పెరంబూర్ కుక్స్ రోడ్డులో వున్న వాటర్‌బరీ మెమోరియల్ తెలుగు బాప్టిస్ట్ సంఘ అధ్యక్షులు కె.ప్రకాశ్‌రావు అధ్యక్షతన నూతన సంవత్సర దివ్యారాధన ఘనంగా ప్రారంభమైంది. చీఫ్ పాస్టర్ రెవ. డా. ఎం.పాల్‌ఈశ్వరప్ప సందేశమందించారు. కార్యదర్శి టీయు.ఆశిశ్ అలెగ్జాండర్, ట్రెజరర్ గుంటి కోర్నెల్, వైస్ ప్రెసిడెంట్ బీఎస్ జీవన్‌బాబు, అసిస్టెంట్ సెక్రటరి ఎర్రగడ్ల జయకుమార్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



పెరంబూర్ తెలుగు బాప్టిస్ట్ చర్చిలో కొత్త సంవత్సరం వేడుకల్లో నిర్వాహకులు, పాస్టర్లు

వెపేరిలో...

వెపేరి హైరోడ్లోని మద్రాస్ సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ చర్చి సంఘంలో కాపరి రెవ. డా.ఎస్ రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన నూతన సంవత్సర ఆరాధనలో సంఘ విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సమాజానికి, సంఘ అభివృద్ధికి సహకరిస్తున్న సేవకులను జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. సంఘ అధ్యక్షుడు జి.రామయ్య, కార్యదర్శి పోతల ప్రభుదాస్, ట్రెజరర్ ఐ.మార్క్, సంఘ వివిధ కమిటీల సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



వెపేరి ఎంసీటీబీసీలో సంఘ సేవకులను జ్ఞాపికలతో సత్కరిస్తున్న పాస్టర్ రాజేంద్రప్రసాద్

సుబ్రమణ్యస్వామి ఆలయంలో భక్తుల రద్దీ

తిరుత్తణి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా తిరుత్తణి సుబ్రమణ్యస్వామి ఆలయం బుధవారం భక్తులతో కిటకిటలాడింది. వేడుకల్లో భాగంగా ఉత్సవమూర్తికి బంగారు కవచం, పచ్చమాల, బంగారు వేలాయుధం, బంగారు కోడి జెండాతో అలంకరించి దీపారాధన చేశారు. ఆలయ ప్రాంగణంలోని వసంత మండపంలో వల్లి, దేవసేన సమేత సుబ్రమణ్యస్వామికి బంగారు ఆభరణాలతో విశేషంగా అలంకరించారు. ఆలయాన్ని పూలతో అందంగా అలంకరించారు. ఈ వేడుకల్లో పలు జిల్లాలతో పాటు ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణా రాష్ట్రాల నుంచి భక్తులు హాజరయ్యారు. వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 200 మంది పోలీసులు భద్రతా విధులు చేపట్టారు.



మెదడు నిర్జీవమైన యువకుడి అవయవదానం



ధనసింగ్ (ఫైల్‌ఫొటో)

వాషర్‌మెన్‌పేట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రమాదంలో చిక్కుకొని మెదడు నిర్జీవమైన యువకుడి అవయవాలతో పలువురికి పునర్జన్మ లభించింది.. తూత్తుకుడి జిల్లా పుదియంపుదూర్ మేల్‌మరం ప్రాంతానికి చెందిన ధనసింగ్ (21) ప్రమాదంలో గాయపడి తూత్తుకుడి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మంగళవారం ధనసింగ్ మెదడు నిర్జీవమైనట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ క్రమంలో, ధనసింగ్ అవయవాలు దానం చేసేందుకు కుటుంబసభ్యులు అంగీకరించారు. ప్రత్యేక శస్త్రచికిత్స ద్వారా వెలికితీసిన కాలేయం, ఒక మూత్రపిండం తిరుచ్చి, మరో మూత్రపిండం తిరునల్వేలి, నేత్రాలు తిరునల్వేలి కంటి ఆస్పత్రికి పంపినట్లు వైద్యులు తెలిపారు. కాగా, అవయవదానం చేసిన ధనసింగ్ భౌతికకాయానికి మంత్రి గీతాజీవన్, కలెక్టర్ ఇలంబగవత్ నివాళులర్పించారు. అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు.

సమాజ సేవే వాసవీ క్లబ్‌ల లక్ష్యం!

● వైద్య శిబిరంలో సుజాత రమేష్‌బాబు



వాసవి క్లబ్ నిర్వాహకులు

ప్యారీస్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): సమాజ సేవే వాసవీ క్లబ్‌ల లక్ష్యమని, సేవలో ఉన్న ఆత్మసంతృప్తి మరెందులోనూ దొరకదని వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ట్రెజరర్ సుజాత రమేష్‌బాబు అన్నారు. సేవే పరమావధిగా ప్రతి ఒక్కరూ ముందుకెళ్లాలని ఆమె పిలుపునిచ్చారు. వాసవీ క్లబ్, టూ స్టార్ కేసీజీఎఫ్ ఎలైట్ చెన్నై, వనిత ఎలైట్ చెన్నై సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఆధ్యాత్మిక పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం డయాబెటీస్ డిటెక్షన్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎలైట్ చెన్నై నూతన అధ్యక్షుడు డాక్టర్ ఎస్.రమేష్‌బాబు అధ్యక్షతన కన్యకాపరమేశ్వరీ దేవస్థానంలో గోపూజ, వాసవీ అమ్మవారి అభిషేక పూజా కార్యక్రమాలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సుజాత రమేష్‌బాబు, వీసీఐ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎంవీ నారాయణ గుప్తా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పాటైన కమిటీ మంచి ప్రాజెక్ట్‌లతో సమాజానికి సేవ చేయాలని, కొత్త సంవత్సరంలో చేపట్టనున్న సేవా కార్యక్రమాల వివరాలు సభకు వివరించారు. అనంతరం డిగ్రీ చదువుతున్న పేద విద్యార్థులకు ఎలైట్ చెన్నై క్లబ్ తరుపున స్కాలర్‌షిప్‌లు అందించారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ టూ స్టార్ ఎలైట్ చెన్నై సెక్రటరీ ఎం.ఉదయ్‌కుమార్, కోశాధికారి గీతాప్రసాద్, వనిత క్లబ్ అధ్యక్షురాలు జోస్న, సెక్రెటరీ విశాలక్ష్మీ, కోశాధికారి జ్యోతిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రోలర్ స్కేటింగ్‌తో కారు తోసిన విద్యార్థులు



కారును తోస్తున్న విద్యార్థులు

పెరంబూర్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): రోలర్ స్కేటింగ్ చేస్తూ కార్లు తోసిన విద్యార్థులు రికార్డు సృష్టించారు. కాంచీపురంలోని స్కేటింగ్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. 8వ తరగతి చదువుతున్న కయల్ల్య, 4వ తరగతి చదువుతున్న తారకేష్ రోలర్ స్కేటింగ్ చేస్తూ సుమారు కి.మీ దూరం కార్లు తోశారు. ఈ సాధన నోబుల్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుంది. అలాగే, కర్రసాము శిక్షణ పొందుతున్న వంద మంది విద్యార్థులు ఫైర్ స్టిక్‌తో గంట సేపు విన్యాసాలు చేసి రికార్డ్ పుస్తకంలో చోటు దక్కించుకున్నారని నిర్వాహకులు తెలిపారు.

నేటి నుంచి ఫ్లవర్ షో

వాషర్‌మెన్‌పేట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నగరంలో నాలుగో ఫ్లవర్ షో ప్రారంభంకానుంది. అన్నాసాలై సెమ్మొళి పార్కులో ఈ పూల ప్రదర్శనను మంత్రి ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం ప్రారంభిస్తారు. గురువారం ప్రారంభమయ్యే ఈ పుష్ప ప్రదర్శన రెండు వారాల పాటు కొనసాగుతుంది.

పోక్సో కేసులో నిందితుడికి యావజ్జీవశిక్ష

ఐసిఎఫ్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పదమూడేళ్ల బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిని నిందితుడికి యావజ్జీవశిక్ష విధిస్తూ పోక్సో ప్రత్యేక న్యాయస్థానం తీర్పు వెలువరించింది. స్థానిక పుక్కడై పోలీస్‌స్టేషన్ పరిధిలో 2023లో 13 ఏళ్ల బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన 43 ఏళ్ల వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు విచారణ పూర్తికావడంతో, నిందితుడికి యావజ్జీవశిక్ష, రూ.30వేల జరిమానా విధిస్తూ మద్రాసు హైకోర్టు ప్రాంగణంలోని పోక్సో ప్రత్యేక కోర్టు మంగళవారం తీర్పు వెలువరించింది.

నీటమునిగి ఇద్దరి మృతి

ఐసిఎఫ్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నీటమునిగి బాలుడు, బాలిక మృతి చెందిన ఘటన కారైక్కాల్‌లో చోటుచేసుకుంది. నాగపట్టణానికి చెందిన శివకుమార్, తన కుటుంబసభ్యులతో కలసి కారైక్కాల్‌లో నూతన సంవత్సరం వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చారు. శివకుమార్ బంధువు కుమారుడు విష్ణు (17), సోదరి కుమార్తె ప్రియదర్శిని (15) ఆ ప్రాంతంలోని సముద్రతీరంలో స్నానం చేస్తున్న సమయంలో, హఠాత్తుగా వచ్చిన అలల్లో చిక్కుకున్నారు. ప్రియదర్శినిని రక్షించిన జాలర్లు ప్రభుత్వాసుపత్రికి తరలించగా, విష్ణు మృతి చెందాడు. అలాగే, కారైక్కాల్ సమీపం పుదుత్తురై ప్రాంతానికి చెందిన రమేష్ కుమారుడు నిసన్‌రాజ్ (17) మంగళవారం రాత్రి సముద్రపు అలల్లో చిక్కుకొని మృతిచెందాడు.

యువకుడి ఉరిశిక్షను స్వాగతించిన ప్రేమలత

ఐసిఎఫ్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ థామస్ మౌంట్ రైల్వే స్టేషన్‌లో ఓ యువతిని రైలు కింద తోసి హతమార్చిన కేసులో నిందితుడికి చెన్నై మహిళా న్యాయస్థానం ఉరిశిక్ష విధిస్తూ ఇటీవల తీర్పు చెప్పింది. ఈ విషయమై డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత విడుదల చేసిన ప్రకటనలో... ఇలాంటి పెద్ద శిక్ష విధించినప్పుడే మహిళలకు జరిగిన అన్యాయానికి న్యాయం జరుగుతుంది. కేసు విచారణ వేగవంతం చేసి నిందితుడికి మరణశిక్ష విధించడంపై డీఎండీకే స్వాగతిస్తున్నట్లు ప్రేమలత పేర్కొన్నారు.

విజయకాంత్‌కు 'గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్' అవార్డు



అవార్డు అందుకుంటున్న ప్రేమలత, తిరుమావళవన్, రాఘవ లారెన్స్, మంత్రి మదివేందన్

చెన్నై, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): 'ఇండియన్ మీడియా వర్క్స్' సంస్థ దివంగత నటుడు విజయకాంత్‌కు 'గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్' అవార్డు ప్రదానం చేసింది. మంగళవారం చెన్నైలో జరిగిన కార్యక్రమంలో విజయకాంత్ తరఫున ఆయన సతీమణి ప్రేమలత అవార్డు అందుకున్నారు. మీడియా వర్క్స్ ఎండీ జాన్ అమలన్, ఐడీఏఎస్ కంట్రోలర్ జయశీలన్ ముఖ్య అతిథిగా హాజరై అవార్డులను అందజేశారు. అదే విధంగా కొరియోగ్రాఫర్ రాఘవ లారెన్స్‌కు 'పురచ్చి కలైంజర్ కెప్టెన్ విజయకాంత్' అవార్డును ప్రదానం చేశారు. అంతేగాక డీపీఐ అధినేత తిరుమావళవన్, రాష్ట్ర మంత్రి మదివేందన్‌లకు కూడా పురస్కారాలను బహూకరించారు.

తిరుత్తణిలో యోగిబాబు పూజలు



తిరుత్తణి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి సుబ్రమణ్యస్వామిని మంగళవారం రాత్రి ప్రముఖ హాస్యనటుడు యోగిబాబు దర్శించుకున్నారు. అర్ధరాత్రి 12 గంటలకు స్వామివారికి నిర్వహించిన దీపారాధనలో యోగిబాబు పాల్గొని, స్వామివారికి పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు.

చెరకు కొనుగోళ్లకు రూ.77 కోట్లు

పెరంబూర్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పొంగల్ సందర్భంగా అందజేయనున్న చెరకు కొనుగోలుకు రూ.77 కోట్లు విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీచేసింది. ఈ ఏడాది పొంగల్ పండుగ సందర్భంగా బియ్యం కార్డులకు పచ్చి బియ్యం, చక్కెర, ఒక చెరకు గడ అందించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. సరకుల కొనుగోలకు రూ.249.75 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. వీటిలో చెరకు గడల కొనుగోలుకు రూ.77.33 కోట్లు కేటాయించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వాషర్‌మెన్‌పేట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా తండయార్‌పేట పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని అధికారులు తెలిపారు. టీహెచ్ రోడ్డు, డిడీర్ నగర్, చెరియన్ నగర్, సుడలైముత్తు వీధి, అశోక్‌నగర్, దేశీయ నగర్, నమ్మయ్య వీధి, పూచమ్మాళ్ వీధి, నాగూరన్ గార్డన్, బాలకృష్ణన్ వీధి, ఫిషింగ్ హార్బర్, ధనపాల్ నగర్, వెంకటేశన్ ఆలి వీధి, వీరరాఘవన్ వీధి, ఇరుసప్ప మేస్త్రీ వీధి, పూండితంగమ్మాళ్ వీధి, ఏతః ఆలయ వీధి, ఆవూర్ ముత్తయ్య వీధి, ఒత్తవాడై వీధి, గాంధీ వీధి, వరదరాజన్ వీధి, మేట్టు వీధి, గ్రామ వీధి, క్రాస్ రోడ్డు, శివన్ నగర్, మంగమ్మాళ్ గార్డన్, జీవా నగర్, ఎంటీటీ క్వార్టర్స్ ప్రాంతాల్లో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

అంబత్తూరులో రౌడీ దారుణ హత్య

ఆరుగురి అరెస్టు

అడయార్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక అంబత్తూరు సమీపంలోని పుదూరులో ఓ రౌడీ దారుణ హత్యకు గురయ్యాడు. పాతకక్షల కారణంగా ఈ హత్య జరిగింది. ఈ హత్య కేసులో సంబంధం ఉన్నట్టు భావిస్తున్న ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. పుదూర్‌కు చెందిన నవీన్ (24) అనే రౌడీపై అనేక హత్య, హత్యాయత్న కేసులున్నాయి. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం అంబత్తూరు కళ్లికుప్పంలో ఉన్న తమ బంధువుల ఇంటికి ద్విచక్రవాహనంపై వెళ్ళగా ప్రత్యర్థులు మాటు వేసి మారణాయుధాలతో దాడి చేశారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన నవీన్‌ను స్టాన్లీ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం చనిపోయాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. నవీన్ మృతి చెందిన సమాచారం తెలుసుకున్న అనుచరులు హత్య జరిగిన ప్రాంతంలో పెట్రోల్ బాంబులు విసిరి, భయాందోళన సృష్టించారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



నటుడు సంతానం - మంత్రి గాంధీ

తిరుమల, జనవరి1(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో తమిళనాడు జౌళి శాఖా మంత్రి గాంధీ, తమిళనటుడు సంతానం ఉన్నారు.

'తమిళనాడు తెలుగు పీపుల్ సొసైటీ' క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరణలో తెలుగు ప్రముఖులు

చెన్నై, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్యారీస్‌లోని ఇంటర్నేషనల్ సదరన్ ఛాంబర్‌లో 'తమిళనాడు తెలుగు పీపుల్ సొసైటీ' ఆధ్వర్యంలో 2025 ఏడాదికి సంబంధించిన క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. మంగళవారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సంస్థ అధ్యక్షులు దేవరకొండ రాజు ప్రసంగిస్తూ.. టీటీడీ దేవస్థానం క్యాలెండర్‌ను అనుసరించి, తిథులు, నక్షత్రాలను ముద్రించామన్నారు. తెలుగు, తమిళం, ఆంగ్ల భాషలను ఒకే క్యాలెండర్‌లో పొందుపరచడం వల్ల అందరూ వినియోగించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ వైస్‌చైర్మన్ కిల్లంపల్లి శ్రీనివాసరావు, బెల్లంకొండ కృష్ణమూర్తి, బెల్లంకొండ ప్రసాద్, ఎన్.సుబ్రహ్మణ్యం, శోభారాజా, వాణి తదితరులు కూడా పాల్గొన్నారు.

ముమ్మరంగా అత్యాచారం కేసు విచారణ

అడయార్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థినిపై జరిగిన అత్యాచార కేసుపై మద్రాస్ హైకోర్టు ఆదేశం మేరకు ఏర్పాటైన త్రిసభ్య కమిషన్ ముమ్మరంగా విచారణ జరుపుతుంది. ఈ అత్యాచార కేసు ఘటనపై డిప్యూటీ కమిషనర్ స్నేహ ప్రియ (అన్నా నగర్), జమాన్ జమాల్ (ఆవడి), బృంద (సేలం)తో కూడిన బృందం లోతుగా విచారణ జరుపుతుంది. ఈ బృందం మూడో రోజైన బుధవారం విద్యార్థినిపై అత్యాచార ఘటన జరిగిన ప్రాంతాన్ని పరిశీలించింది. ఈ కేసులో అరెస్టు చేసిన నిందితుడు జ్ఞానశేఖరన్ నేపథ్యం? ఈ లైంగిక దాడికి పాల్పడటానికి తోటి ఉద్యోగుల సహకారం, ప్రోద్బలం ఉందా? అని విచారణ జరుపుతున్నారు. ముఖ్యంగా నిందితురాలికి సంబంధించిన ఎఫ్ఐఆర్ ఎలా లీకైంది? సాంకేతిక కారణాల వల్ల జరిగిందా? లేదా ఉద్దేశ్యపూర్వకంగా జరిగిందా? అనే అంశంపై విచారణ జరుపుతున్నారు.

న్యూ ఇయర్ వేడుకల్లో అపశృతి

● నలుగురి మృతి

అడయార్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సర వేడుకల సందర్భంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన ప్రమాదాల్లో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ఒకటి రెండు ఘటనల్లో మద్యం మత్తులో వాహనాలు నడపడంతో ఈ ప్రమాదాలు జరిగాయి. చెట్‌పేట్‌లోని గెంగురెడ్డి సబ్‌వేలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న దీపక్ అనే వ్యక్తి వంతెన గోడను ఢీకొట్టి మృతిచెందాడు. వెనుక సీటులో కూర్చొన్న బాబు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వడపళనికి చెందిన చారుకేష్ (19) అనే విద్యార్థి తన స్నేహితులతో కలిసి ఈసీఆర్‌లో జరిగిన కొత్త సంవత్సర వేడుకల్లో పాల్గొని ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తుండగా, నీలాంకరై సమీపంలో నియంత్రణ కోల్పోయిన బైక్ కంటైనర్‌ను ఢీకొట్టింది. దీంతో చారుకేష్ అక్కడే ప్రాణాలు కోల్పోయాడు. పెరుంబాక్కంకు చెందిన నితీష్ (18) అనే విద్యార్థి బైక్‌లో వస్తుండగా జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. అలాగే, కేలంబాక్కం సమీపంలోని నావలూరు వద్ద మంగళవారం అర్ధరాత్రి జరిగిన మరో ప్రమాదంలో ఓ యువకుడు చనిపోయాడు. ఈ ప్రమాదాలపై ఆయా ప్రాంతాలకు చెందిన స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

పొంగల్ రేస్ నుంచి తప్పుకున్న 'విడాముయర్చి'



'విడాముయర్చి'లో అజిత్, త్రిష

పొంగల్ రేసు నుంచి అగ్రహీరో అజిత్ కుమార్, త్రిష జంటగా నటించిన 'విడాముయర్చి' తప్పుకుంది. ఈ మేరకు మేకర్స్ మంగళవారం రాత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రకటనలో 'అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు. కొన్ని అనివార్య కారణాల వల్ల సంక్రాంతికి విడుదలకావాల్సిన 'విడాముయర్చి' చిత్రం వాయిదాపడింది. ఈ కొత్త సంవత్సరం ప్రతి ఒక్కరికీ శుభం చేకూర్చాలని కోరుకుంటూ నూతన సంవత్సర శుభాకాంక్షలు' అని నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. కాగా, మగిళ్ తిరుమేని దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అజిత్ సరసన త్రిష నటించగా, ఇతర పాత్రల్లో రెజీనా, ఆరవ్ వంటి ప్రధాన తారాగణం నటించారు. హాలీవుడ్ చిత్రం 'బ్రేక్‌డౌన్'కు తమిళ రీమేక్‌గా ప్రకటించారు. అయితే, హాలీవుడ్ మూవీ రైట్స్ కొనుగోలు అంశంలో సమస్యలు తలెత్తడం వల్లే విడుదలను తాత్కాలికంగా వాయిదా వేసినట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. కాగా, అనిరుధ్ రవిచందర్ సంగీతం సమకూర్చిన ఈ చిత్రంలోని పాటలను ఒక్కొక్కటిగా రిలీజ్ చేయగా, అవి ఇప్పటికే ఆదరణ పొందాయి. భారీ బడ్జెట్‌తో నిర్మించిన ఈ చిత్రాన్ని తమిళంలో రెడ్ జెయింట్ మూవీస్ పంపిణీ చేస్తుంది.

20 యేళ్ళ తర్వాత '7జీ రెయిన్‌బో కాలనీ'కి సీక్వెల్

చిత్రజ్యోతి

సెల్వరాఘవన్ దర్శకత్వంలో వచ్చిన '7జీ రెయిన్‌బో కాలనీ'కి 20 యేళ్ళ తర్వాత సీక్వెల్ రూపొందుతుంది. 2004లో వచ్చిన ఈ సినిమా... తమిళ చిత్రపరిశ్రమలో హృదయాన్ని హత్తుకునే రొమాంటిక్ మూవీగా నిలిచిపోయింది. తొలిభాగంలో తన సంగీతంతో అభిమానుల మనసులను గెలుచుకున్న యువన్ శంకర్ రాజా... రెండో భాగానికి కూడా స్వరాలు సమకూర్చుతున్నారు. ప్రముఖ నిర్మాత ఏఎం రత్నం తన సొంత నిర్మాణ సంస్థ సూర్య మూవీస్ పతాకంపై నిర్మించే ఈ చిత్రం మొదటి భాగంలో కథానాయకుడిగా నటించిన రవికృష్ణ తన ల్యాండ్‌మార్క్ రోల్ పునరావృతం చేయనున్నారు. హీరోయిన్‌గా అనస్వర రాజన్‌ను ఎంపిక చేశారు వీరితో పాటు జయరామ్, సుమన్ శెట్టి, సుధ ప్రధాన పాత్రలను పోషిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ తుది దశకు చేరుకుందని మేకర్స్ వెల్లడించారు.



'7జీ రెయిన్‌బో కాలనీ'లో అనస్వర రాజన్

మూడు భాగాలుగా 'వాడివాసల్'

దర్శకుడు వెట్రిమారన్ - హీరో సూర్య కాంబినేషన్‌లో తెరకెక్కనున్న 'వాడివాసల్' మూడు భాగాలుగా రూపొందించనున్నారు. తదనుగుణంగా కథ, స్క్రీన్‌ప్లే రూపొందించే పనిలో దర్శకుడు వెట్రిమారన్ నిమగ్నమైవున్నట్టు సమాచారం. ప్రస్తుతం హీరో సూర్య-44, సూర్య-45 చిత్రాల్లో నటిస్తున్నారు. వీటిలో ఒక చిత్రానికి కార్తీక్ సుబ్బరాజ్, మరో మూవీకి ఆర్జే బాలాజీ దర్శకత్వం వహిస్తున్నారు. అలాగే, వెట్రిమారన్ దర్శకత్వం వహించిన 'విడుదలై-2' గత నెల 20వ తేదీన విడుదలై ఘన విజయం సాధించిన విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలో సూర్య - వెట్రిమారన్ కాంబినేషన్‌లో గతంలో 'వాడివాసల్' ప్రాజెక్టును ప్రకటించగా, ఇపుడు దర్శకుడు ఈ మూవీపై దృష్టిసారించారు. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించనున్నారు. జల్లికట్టు ఇతివృత్తంతో రూపొందించే ఈ సినిమా కోసం హీరో సూర్య జల్లికట్టు వీరులతో కలిసి శిక్షణ కూడా పొందిన వీడియో, ఫొటోలను కూడా మేకర్స్ గతంలో ప్రకటించిన విషయం తెల్సిందే. ప్రముఖ నిర్మాత కలైపులి ఎస్.థాను ఈ చిత్రాన్ని 'వి' క్రియేషన్స్ బ్యానరుపై భారీ బడ్జెట్‌తో తెరకెక్కించనున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం ప్రొడక్షన్ పనులపై దర్శకుడు దృష్టిసారించినట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం.



సూర్య, వెట్రిమారన్







వడపళనిలోని సుబ్రమణ్యస్వామి ఆలయం ముందు భక్తజన సందోహం



ఆలయం ముందు పూలు, పండ్లతో అలంకరణ

న్యూ ఇయర్ వేళ... వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

- ఆలయాలు, ప్రార్థనా మందిరాలకు పోటెత్తిన జనం

కొత్త సంవత్సరం రోజైన బుధవారం రాష్ట్రంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. ఆలయాలు, చర్చిలు, మసీదులకు వెళ్లిన నూతన సంవత్సరంలో అంతా మంచి జరగాలని కాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తిరుచ్చి జిల్లా శ్రీరంగం రంగనాథ స్వామి ఆలయం, తంజావూరు బృహదీశ్వరాలయం సహా రాజధాని నగరం టి.నగర్‌లోని వెంకటేశ్వరాలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో పోటెత్తారు.

\- ప్యారీస్, ఆంధ్రజ్యోతి

వడపళనిలో...

వడపళని సుబ్రమణ్యస్వామి ఆలయంలో కొత్త సంవత్సరం రోజు స్వామివారి దర్శనార్థం అర్ధరాత్రి నుంచే భక్తులు కుటుంబసభ్యులతో తరలివచ్చారు. తెల్లవారుజామున 3 గంటలకు ఆలయాన్ని తెరిచి, స్వామివారికి ప్రత్యేక అలంకారాభిషేకాలను నిర్వహించారు. అనంతరం 4 గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతించారు. ఉదయం నాణేల అలంకరణ, అనంతరం స్వర్ణకవచాలంకరణ, రాజాలంకరణ, పుష్పాలంకరణలో స్వామివారు భక్తులను కటాక్షించారు. భక్తులందరికీ ఆలయ నిర్వాహకులు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. అదే విధంగా వడపళని వేంగీశ్వరాలయం, ట్రిప్లికేన్‌లోని పార్థసారథి స్వామివారి ఆలయం, ప్యారీస్ తంబుచెట్టివీధిలో వున్న కాళికాంబాళ్ కమటేశ్వరాలయం, షావుకారుపేట రాజప్ప వీధిలో వున్న కందస్వామి ఆలయం, కోయంబేడులోని కురుంగాలీశ్వరాలయం, తిరువేర్కాడు శ్రీదేవి కరుమారియమ్మన్ ఆలయంలో కొత్త సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.



శ్రీవారి ఆలయ ఏర్పాట్లలో నిర్వాహకులు







న్యూ ఇయర్ జోష్

టి.నగర్‌లో...

స్థానిక టి.నగర్ వెంకటనారాయరోడ్డులోని టీటీడీ సమాచార కేంద్రం వెంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. క్యూలైన్లలో అర్ధరాత్రి నుంచే వేచివున్న భక్తులను తెల్లవారుజామున 3 గంటల నుంచి బుధవారం రాత్రి 10 గంటల వరకు అనుమతించారు. నూతన సంవత్సరంలో పద్మావతీ సమేత శ్రీవారి దర్శించుకున్న భక్తులు పులకించిపోయారు. ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా ఆలయ ప్రాంగణం, పరిసర ప్రాంతాలను అరటి తోరణాలు, పూలు, విద్యుద్దీపాలతో అలంకరించారు. భక్తుల గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండరా నగర పోలీసులు బ్యారీకేడ్లు ఏర్పాటు చేసి, బందోబస్తు నిర్వహించారు. సమాచార కేంద్ర మాజీ అధ్యక్షుడు నూతలపాటి శ్రీకృష్ణ, మాజీ సభ్యులు చంద్రశేఖర్, రామాంజనేయులు, మన్నూరు చలపతి, అనిల్‌కుమార్‌రెడ్డి, రామ్మోహన్‌రావు, రాధాకృష్ణ, శ్రీనివాస్‌రావు, ఏఈవో పార్థసారధి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మసీదుల్లో...

నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ముస్లింలు సంవత్సరాది తొలి క్షణాల్లో భగవంతుని ప్రార్థనలో నిమగ్నమయ్యారు. అదే విధంగా నాగూర్ తదితర దర్గాల్లోనూ భక్తులు పెద్ద ఎత్తున ప్రార్థనలు నిర్వహించారు.





చర్చిల్లో...

నాగపట్నం జిల్లాలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన వేలాంకన్ని, తిరుత్తురైపూండి మేరీమాత ఆలయం, తూత్తుకుడిలోని పనిమయ ఆలయం, తిరుచ్చి సేక్రెడ్ ఆలయం, స్థానిక బీసెంట్‌నగర్ వేలాంకన్ని, ప్యారీస్ సెయింట్ ఆంటోనీ ఆలయం, జెమినీ సర్కిల్లోని కేథడ్రల్ చర్చి, పెరంబూరులోని సెయింట్ పీటర్స్ ఆలయం సహా అన్ని చర్చిలను నూతన సంవత్సరం సందర్భంగా విద్యుద్దీపాలతో అందంగా తీర్చిదిద్దారు. అర్ధరాత్రి నుంచి నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలకు క్రైస్తవులు హాజరయ్యారు.



భక్తులకు బిషప్ ఆశీస్సులు



తన ముద్దుల చిన్నారితో ప్రార్థనల్లో పాల్గొన్న మహిళ





చర్చి ప్రార్థనల్లో యువత





క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

నోట్లతో అమ్మవారి ఆలయంలో అలంకరణ



పెరంబూర్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నూర్ నడికుప్పం జాలర్ల గ్రామంలో చిన్నమ్మన్ ఆలయం ఉంది. ఈ ఆలయానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వచ్చి అమ్మవారిని పూజిస్తుంటారు. ఈ క్రమంలో, నూతన సంవత్సరం సందర్భంగా గ్రామస్తులు రూ.10.50 లక్షల విలువైన కరెన్సీ నోట్లతో రూపొందించిన తోరణాలు అమ్మవారి సన్నిధి చుట్టూ అలంకరించారు. దీనిని చూసేందుకు వచ్చిన భక్తులు, అమ్మవారిని దర్శించుకొని, పూజలు చేశారు.



ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా బుధవారం రాత్రి మెరీనా తీరంలో ఉన్న తన తండ్రి, మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న సీఎం స్టాలిన్

ఆస్కాలో ఉత్సాహంగా... ఉల్లాసంగా న్యూ ఇయర్ వేడుకలు





వేడుకల్లో ఆస్కా నిర్వాహకులు రంగారెడ్డి, కేకే చౌదరి తదితరులు - నృత్యాలతో అలరిస్తున్న కళాకారులు

ప్యారీస్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్‌లోని ఆంధ్ర సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ (ఆస్కా) ఆధ్వర్యంలో కొత్త సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రూప్ డాన్స్‌లు... మహిళల ర్యాంప్ వాక్ తదితర కార్యక్రమాలతో అలరించారు. ఆస్కా ప్రాంగణంలో మంగళవారం రాత్రి 8 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు ఆస్కా అధ్యక్షుడు డా.కె.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో ఆస్కా సభ్యులు కుటుంబ సమేతంగా హాజరయ్యారు. ఆస్కా సాంస్కృతిక కార్యదర్శి డి.దేవేంద్రన్, కోశాధికారి రంగారెడ్డి, కమిటీ సభ్యులు కేకే చౌదరి, శ్రీధర్, పురుషోత్తం, దిలీప్ పర్యవేక్షణలో వేడుకలు ఆద్యంతం సందడిగా సాగాయి. మంగీస్ డాన్స్ కంపెనీ కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు, ప్రత్యేక ప్రదర్శనలు కనువిందు చేశాయి. 2025 లక్కీడీప్‌లో విజేతలుగా నిలిచిన వారికి నిర్వాహకులు బహుమతులు అందించారు. కార్యక్రమంలో చివరగా ఆంధ్ర వంటకాలతో విందు భోజనం ఏర్పాటుచేశారు.

బుధవారం ముఖ్యమంత్రి స్టాలిన్‌ను ఆయన నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతున్న చెన్నై పోలీసు కమిషనర్ అరుణ్ తదితరులు



'రామ్‌రాజ్' ఉద్యోగులకు అభినందన



చెన్నై, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): వస్త్రరంగంలో ప్రసిద్ధి చెందిన 'రామ్‌రాజ్' కాటన్ సంస్థ నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని తన ఉద్యోగులను సత్కరించింది. తిరుప్పూర్ ప్రధాన కార్యాలయంలో బుధవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సుదీర్ఘకాలం పని చేసిన ఉద్యోగులను ప్రత్యేకంగా సత్కరించింది. అదే విధంగా ప్రతిభా పాటవాలను ప్రదర్శించిన ఉద్యోగులకు ప్రశంసపత్రాలు అందజేసింది. సంస్థ ఛైర్మన్ కేఆర్ నాగరాజన్, ఎండీ అరుణ్ ఈశ్వర్ తదితరులు ఈ వేడుకల్లో పాల్గొని వందమంది ఉద్యోగులకు ప్రశంసాపత్రాలతో పాటు బంగారు, వెండి నాణేలను కూడా బహూకరించారు.

సమ్మోహపరచిన 'ఆత్రేయ' నాట్య ప్రదర్శన



పెరంబూర్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక మైలాపూర్‌లో రసిక రంజని సభ నిర్వహిస్తున్న మార్గళి మ్యూజికల్ ఫెస్టివల్ భాగంగా మంగళవారం రాత్రి 15 ఏళ్ల ఆత్రేయ కృష్ణన్ బాలాజి భరతనాట్య ప్రదర్శన సభికులను సమ్మోహన పరిచింది. అమెరికాలోని టెక్సాస్ ఆస్టిన్‌లో నివశించే ఆత్రేయ, 11 ఏళ్లుగా వనితా సుబ్రమణ్యం వద్ద శిక్షణ పొందుతోంది. ఆత్రేయ ప్రదర్శించిన భరత నాట్యం ఆకట్టుకుంది. అలాగే, ఈ నెల 6వ తేది శాంతోమ్ బాలగణపతి హాలులో సాయంత్రం 7 గంటలకు ఆత్రేయ నాట్య ప్రదర్శన ఉంటుందని కార్తీక్ ఫైన్ ఆర్ట్స్ నిర్వాహకులు తెలిపారు.